క్లుప్తంగా

డ్రైనుకు శంకుస్థాపన



రెండవ వార్డులో డ్రైనుకు శంకుస్థాపన చేస్తున్న కుసుమ

సామర్లకోట: స్థానిక రెండవ వార్డు సంత మార్కెట్ రోడ్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.70 లక్షలతో నిర్మాణం చేసే డ్రైను పనులకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాలిక కుసుమ సోమవారం శంకుస్థాపన చేశారు. దీర్ఘకాలికంగా డ్రైను నిర్మాణం చేయక పోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. కౌన్సిల్ సమావేశంలో సమస్యను వివరించడంతో నిధులు మంజూరు కాగా పనులకు శంకు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక చంటిబాబు, టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాపై పన్నులు తగ్గించాలి



ఆక్వా రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రైతు సంఘం నేత అప్పారెడ్డి

కొత్తపల్లి: ఆక్వా ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం పన్ను తగ్గించాలని రైతు సంఘం నాయకుడు గుర్రాల అప్పారెడ్డి అన్నారు. మండలంలోని ఆక్వా రైతులను సోమవారం కలిసి ఈ నెల 11 తేదీన విజయవాడలో జరగబోయే ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. అప్పారెడ్డి మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో ఆక్వా, చేపల పెంపకం చేస్తున్నారు. తీర ప్రాంతంలో రొయ్యల పరిశ్రమలు, హేచరీలపై ఆధారపడి వేలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ విధంగా సుంకాలు విధించడంతో ఆక్వా రైతులు పూర్తిగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకట సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



పంచాయతీ కార్యదర్శులకు (టీఓటీ) శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ శేషుబాబు

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజులపాటు పంచాయతీ కార్యదర్శులకు టీఓటీలుగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ ఎంపీడీఓ కె.శేషుబాబు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో ఎంపికైన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ మేరకు మూడు రోజుల పాటు శిక్షణ కేంద్రంలో భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు వి.జగన్నాథం, ఎం.రాజ్‌కుమార్, కేఆర్ నిహారిక పాల్గొన్ని శిక్షణ నిర్వహించారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి



రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీడీపీఓ లక్ష్మి

కాకినాడ రూరల్: సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉంటూ విద్యను అభ్యసించాలని ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో ఏపీఐఐసీ కాలనీలో జరిగిన సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆరు ఏళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బొమ్మలు, వివిధ రకాల ఆట వస్తువులతో విద్యను అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆరు ఏళ్ల పైబడిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పించాలన్నారు. కార్యక్రమంలో మజీ సర్పంచ్ రత్నప్రసాద్, డాక్టరు శిరీష, సుబ్బారావు, శ్రీనగేష్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న రైతు గుండె

- ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం
- పిఠాపురంలో రైతుల ఆందోళన
- మద్దతు పలికిన వైఎస్సార్ సీపీ నేతలు



విరవాడలో యూరియా లేక పాడైపోయిన పంటను చూసి నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు



గొల్లప్రోలు మండలంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

పిఠాపురం: ఏనాడైనా పంట పండించారా? పంటకు ఎంత ఎరువు వెయ్యాలో మీకు తెలుసా? మరి ఏమి తెలుసని యూరియా ఎక్కువ వాడుతున్నారంటున్నారు.. రైతు గుండే మండితే తినడానికి తిండి లేని పరిస్థితి వస్తుందంటూ పలువురు రైతులు కూటమి నేతలను నిలదీశారు. పిఠాపురం మండలం విరవాడలో యూరియా లేక దుబ్బు కట్టక పల్చబడిపోయిన చేను చూస్తూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు మద్దతు పలికి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు, వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ మంగళవారం కాకినాడ ఆర్డీఓ ఆఫీస్ దగ్గర జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో కూటమి నాయకులు అవగాహన లేని మాటలతో రైతులను హేళన చేస్తున్న విధానాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కావలసినంత యూరియా ఉంది అని తప్పుగా చెబుతున్నారని, ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండి యూరియా తగ్గించండి అని చెప్పడంపై రైతులు మండిపడ్డారు. మీరు రైతుకి సరైన ఎరువు యూరియా ఇవ్వకపోగా, అవగాహన లేని మాటలు మాట్లాడతారా అంటూ సీఎం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వంలో రైతు క్షేమంగా ఎక్కడ ఉన్నాడు తెల్లవారితే రోడ్డెక్కి యూరియా కోసం రోజుల తరబడి స్లిప్పులతో లైన్లో నుంచుంటున్నారన్నారు. ఇంత జరుగుతున్న రైతు కష్టాలు కనిపించట్లేదా అని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు చేయలేకపోతే గద్దె దిగిపోండి, అంతేగాని అవసరం లేదని చెప్పడం తగదన్నారు. ఇకనైనా తప్పుడు ఆలోచనలు మానుకోవాలని, రైతుకి సరైన న్యాయం చేయండంటూ కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ అడపా రఘు, రాష్ట్ర యూత్ కార్యదర్శి ఉలవల భూషణం, సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఎంపీటీసీ జవ్వాది వాడపల్లి, మాజీ జెడ్పీటీసీ జవ్వాది కృష్ణ మాధవరావు, పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రైతు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి బాబి, వర్ధనీడి సుజాత, పెదపాటి రాజేష్,తలిశెట్టి వెంకటేశ్వరరావు, పశ్చిమల్ల అప్పలరాజు, బొజ్జ రామయ్య, కొత్తెం దత్తుడు, సయ్యద్ మొహిద్దిన్ సోమారౌతు లలిత పెదపాటి నాగేశ్వరరావు, కరణం చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు పిలుపునిచ్చారు. చేబ్రోలులోని పార్టీ రూపొందించిన రైతు పోరు పోస్టర్‌ను జెడ్పీటీసీతోపాటు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి నానాజీ, మండల రైతు విభాగం అధ్యక్షులు లోకారెడ్డి అప్పన్నదొర తదితరులు ఆవిష్కరించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి వంగా గీత ఆదేశాల మేరకు ప్రతికార్యకర్త, రైతులు కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. కాకినాడ ఆర్డీఓ కార్యాలయం వద్ద జరుగు నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. యూరియా అందక రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే కార్యక్రమం ఏర్పాటు చేశామని నానాజీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పుప్పాల బాబులు, బీసీ విభాగం కన్వీనర్ నూజివీడు సూర్య, ప్రచార విభాగం అధ్యక్షుడు ఓరుగంటి ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్ ఓరుగంటి సత్య నూకరాజు, మండల కార్యవర్గ సభ్యులు ములికే శ్రీను, ముమ్మిడి సూర్యనారాయణ, నాయకులు ఓరుగంటి రవి, వార్డు సభ్యులు దేవర కష్ణ, చల్ల విష్ణు, సోమ్రౌతు సూర్యనారాయణ, వులవకాయల సత్తిబాబు, వులవల కొండ, ఓరుగంటి రాజా, కర్రి చక్రం, పెంకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కూపన్లకు రైతుల పాట్లు

- అన్నదాత పోరు పిలుపుతో కదిలిన ప్రభుత్వం
- ప్రతి గ్రామంలో ఎరువులకు కూపన్ల పంపిణీ



వీకే రాయపురంలో ఎరువుల కూపన్ల కోసం సొసైటీ వద్ద రైతుల పాట్లు

సామర్లకోట: వరి పంట పిలకలు పోసుకునే దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో పాలు పోసుకుంటోంది. ఈ దశలో పంటకు ఎరువులు అందించాలి. అందువల్ల రైతులు ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. రైతులకు ఎరువులు లభించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలంకావడంతో రైతులకు అండగా వైఎస్సార్ సీపీ నిలిచింది. దీనిలో భాగంగా మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద డివిజన్ వ్యాప్తంగా ధర్నా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ నాయకులు నిర్ణయించారు. దీంతో ప్రభుత్వంలో కదలిక వచ్చి ప్రతి గ్రామంలోను సొసైటీ, రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు కూపన్లు పంపిణీ చేసి యూరియాను పంపిణీ చేశారు. దీనిలో భాగంగా సోమవారం మండల పరిధిలోని వీకే రాయపురం సొసైటీకి ఎరువులు రావడంతో రైతులు పరుగులు తీశారు. ఒకేసారి అధిక సంఖ్యలో రైతులు రావడంతో ప్రాథమిక సహకారం సంఘానికి రైతులకు వ్యవసాయాధికారులకు మధ్య గలాటా జరిగింది. 10 సెంట్ల భూమి సాగు చేసుకొనే వారికి 20 ఎకరాల వరకు కౌలు చేసుకొని సాగు చేసే వారికి కేవలం ఒక బస్తా మాత్రమే ఇవ్వడం ఏమిటని రైతులు సొసైటీ అధికారులను నిలదీశారు. రైతులు తమ అవసరాల కోసం కూలీలను క్యూలైన్ల లో ఉంచారు. గ్రామానికి చెందిన రంగనాథం మహేష్ అచ్చుతాపురత్రయంలో భూమి కౌలుకు చేసుకొంటూ యూరియా కూపన్ కోసం క్యూలైన్‌లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామంలో భూమి సాగు చేసుకొంటున్న వారికే పిండి ఇస్తామని వ్యవసాయాధికారులు చెప్పడంతో మహేష్ వ్యవసాయాధికారులతో వాదనకు దిగాడు. దాంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకొని గుంపుగా ఉన్న వారిని చెదరు కొట్టారు. గ్రామంలోని రైతులందరికీ ఎరువులు ఇస్తామని ఏఓ మురళీధర్ హామీ ఇవ్వడం రైతులు శాంతించారు. ఉదయం కూపన్ల కోసం, సాయంత్రం యూరియా కోసం సొసైటీ వద్ద రావలసిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

పీజీఆర్ఎస్‌కు ఆరు అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్(పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్‌కు డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఆరు అర్జీలు వచ్చినట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి



రైతుల సమస్యలపై సామర్లకోట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన సీపీఐ నాయకులు



పాడా అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: ఎరువుల బ్లాక్ మార్కెట్ అరికట్టి రైతులందరికీ క్రమంగా ఎరువులు అందే విధంగా చూడాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకొంటూ రైతులకు ఎరువులు లేకుండా చేయడం దారుణమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ ఆరోపించారు. ప్రజల కోసం రైతులు పంటలు పండిస్తున్నారని, రైతులు ఆందోళనకు దిగితే ప్రభుత్వాలు స్తంభించిపోతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, జిల్లా మహిళా కార్యదర్శి పి. భవానీ, పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ, నాయకులు బర్ల లక్ష్మీనారాయణ, మడగల రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతుల సమస్యలపై తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

పిఠాపురం: రైతులకు యూరియా పంపిణీలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా నాయకులు డీఎస్ బాబ్జి విమర్శించారు. ఆయన ఆధ్వర్యంలో సీపీఎం, వివిధ పార్టీల నేతలు పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై సోమవారం పాడా పీడీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్సులో వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కన్వీనర్ కే చిన్న అధ్యక్షతన పాడా కార్యాలయం వద్ద నిసరన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు సమృద్ధిగా యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉప్పాడ-పిఠాపురం రోడ్డు నిర్మాణానికి నిధులు ఇచ్చామన్న విషయం ప్రకటనలకే తప్ప నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. పిఠాపురంలో అనేక వార్డుల్లో డ్రైనేజీ సగం వరకే ఉన్నాయని, కొన్ని చోట్ల అవి కూడా లేవన్నారు. పిఠాపురం పట్టణంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఒకటో వార్డులో రాపర్తి వెళ్లే మార్గం బైపాస్ రోడ్డు ఆనుకుని ఉన్న ప్రజలకు వ్యక్తిగత కుళాయి కలెక్షన్లు మంజూరు చేయాలని, రజక వీధిలో డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తాము ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలు త్వరలో పరిష్కారం కాకపోతే భవిష్యత్‌లో ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంకు బీఎస్పీ నాయకులు కండవల్లి లోవరాజు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బోనాసుల శివ ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నాగేశ్వరరావు, కోనేటి రాజు, వీరబాబు, విశ్వనాథం, కే మణి, వి.సూర్యనారాయణ, సత్యనారాయణ, కృష్ణవేణి, గోపాలకృష్ణ, అరుణ్ కుమారి, వంగలపూడి నాగు, ఎ.అప్పారావు, ఉదయ్ భాస్కర్, నరసింహమూర్తి, బి.రాంబాబు, కే అపర్ణ, దేవుడబ్బాయి, నున్న, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. మర్లావ గ్రామంలోని గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు పది వేల మంది భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కాతా పెద్దకాపు, కాతా శంకరరావు, కామన రామకృష్ణ, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో ఆలయంలోని కుమార రామభీమేశ్వర స్వామివారికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి అర్చకులు అభిషేకాలు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదాలను పెట్టారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు



తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం



పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సామర్లకోట: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. బలుసులపేట, సంత మార్కెట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా కోసం సుమారు 25 ఏళ్ల క్రితం సంతమార్కెట్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్సుఫార్మర్ నిలబెట్టడానికి మూడు ఇనుప విద్యుత్ స్తంభాలను పెట్టారు. అయితే ఆ మూడు ఆ స్తంభాల కింది భాగంలో పూర్తిగా తుప్పు పట్టి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీనిపై మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళితే తమకు సంబంధం లేదని చెప్పుతున్నారని రెండో వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ తెలిపారు. ట్రాన్సుకో అధికారుల దృష్టికి తీసుకు వెళితే స్తంభాలు మార్పు చేయాలంటే ఫీజు కట్టాలని చెప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్తంభాలు కూలిపోయే ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరూ వహిస్తారని కౌన్సిలర్ ప్రశ్నించారు. ఆ వార్డులో డ్రైను నిర్మాణంగా సందర్భంగా విద్యుత్ స్తంభాలను పరిశీలించినట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలిక చంటిబాబు తెలిపారు.

ప్రజా కళకు ఊపిరి గరికపాటి జీవితం



గరికపాటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఎన్ఎం నాయకులు

పెద్దాపురం: ప్రజా కళాకారులకు ఊపిరి పోసిన గరికపాటి రాజారావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కళాకారులు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం గరికపాటి 62వ వర్ధంతి సభ ప్రజా నాట్యమండలి మండల కార్యదర్శి డి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాహితి స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాల ప్రారంభ సమయంలో సంస్కృత వ్యవస్థను ఆయన ప్రారంభించారన్నారు. సమసమాజ భావ జాలంతో కళను, కళా రూపాలను తీర్చిదిద్దిన ఘనత గరికిపాటికే దక్కిందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం నాయకులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, మహపాతిన రాంబాబు, భజన సంఘం నాయకులు నీలం శ్రీను, సిరిపురపు శ్రీనివాస్, గూనూరి రమణ, ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు'కు తరలిరావాలి

సామర్లకోట: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు అధిక సంఖ్యలో తరలిరావాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గక కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌కు వెళ్లి అక్కడ నుంచి ప్రత్తిపాడు, కిర్లంపూడి, జగ్గంపేట, తుని నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం చేరుకొని ధర్నా నిర్వహిస్తామని దొరబాబు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువులు అందించకుండా నడ్డి విరుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. వాకతిప్పలో వైఎస్సార్ సీపీ నాయకుడు కార్యాలయం వద్ద సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే అన్నదాత పోరు పోస్టర్‌ను రైతులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, సర్పంచి కర్రి చిన్నారావు, ఎంపీటీసీలు రాయుడు విష్ణు, మేరుగు యల్లాజీ, అబ్బిరెడ్డి రాంచంద్రారెడ్డి, గోపి హరిబాబు, కొండమూరి కామేశ్వరావు, ఆలపు సుధారాణి, జొన్నాడ సత్యన్నారాయణ, యరకం ప్రసాదరెడ్డి, జ్యోతుల వెంకటరావు, జ్యోతుల సత్యన్నారాయణ, కదారి సతీష్, గొరిసే సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తులసీ కుమార్‌కు సత్కారం

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి(పార్లమెంటు) అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఈసందర్భంగా పోరుబాట పోస్టర్ ఆవిష్కరణకు విచ్చేసిన తులసీకుమార్‌ను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన నాని, గోపి హరిబాబు, ఇంటి బాబ్జీ, సర్పంచి కర్రి చిన్నారావు, కుక్కల వెంకటరమణ, ఆలసు సుధారాణి, ఎంపీటీసీలు మేరుగు యల్లాజీ, రాయుడు విష్ణు, గోగు జగన్నాథం తదితరలు ఉన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో జేసీఐ ప్రతినిధి డాక్టర్ తన్మయి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో 17మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) కాకినాడ పోర్టు వారి సహకారంతో హెచ్ఎం గాయత్రి సమక్షంలో సోమవారం 17మందికి రూ.3వేలు చొప్పున రూ.51వేలు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పది, ఇంటర్‌లో 65శాతం మార్కులు సాధించిన విద్యార్థులను స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేశామని, వచ్చే సంవత్సరం మరింత మందికి ప్రోత్సాహం అందజేస్తామని జేసీఐ కాకినాడ పోర్టు అధ్యక్షురాలు డాక్టరు తన్మయి తెలియజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి సత్యవోలు శ్రీనివాస్, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజు, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, మూర్తి, కృష్ణవేని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాండవ్య నారాయణుని గ్రామోత్సవం



పట్టణంలో స్వామివారి ఊరేగింపు

సామర్లకోట: పట్టణంలోని అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా సాగింది. ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, పెద్దవీధి, చిన్నవీధి, యార్లగడ్డ వారి వీధి, దేవిచౌక్ మీదుగా గ్రామోత్సవం సాగింది. తమ తమ ఇళ్ల వద్దకు వచ్చిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

12న కవి సమ్మేళనం

బోట్‌క్లబ్: సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఈ నెల 12న సాయంత్రం స్థానిక సుందరయ్య భవన్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాం ఏచూరి– సమ సమాజ ఆలోచన అనే అంశంపై ఈ కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. సాహితీ ప్రియులందరూ పాల్గొనాలని కోరారు.